బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: ఓయూ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, సెప్టెంబర్ 3లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 10వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: ఓయూ పరిధిలోని ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను సెప్టెంబర్ 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కృష్ణస్వామి సేవలు అజరామరం

- ఘనంగా నగర తొలి మేయర్ 131వ జయంతి
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు


చిలకలగూడలో కొర్వి కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: బలహీనవర్గాల కోసం కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ చేసిన సేవలు అజరామరమని కార్పొరేటర్ హేమ అన్నారు. చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద సికింద్రాబాద్ ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణస్వామి జయంతిలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. 1922లో నిజాం రాజ్య ముదిరాజ్ మహాసభను స్థాపించి ముదిరాజ్‌లతోపాటు నగరంలోని బలహీనవర్గాల వారి కోసం విద్యా రంగంలో ఆయన వంతుగా కృషి చేశారని ఆమె తెలిపారు. ఆయన అనేక గ్రంథాలయాలను కూడా స్థాపించారని గుర్తుచేశారు. హైదారాబాద్ నగర మేయర్‌గా కూడా సేవలందించాని గుర్తుచేశారు. తన హయాంలోనే హైదరాబాద్‌కు మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో యాదగిరి ముదిరాజ్, సంజీవ్ ముదిరాజ్, సతీశ్‌ముదిరాజ్, గణేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, నగేశ్, రాంబాబు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


కృష్ణస్వామి జయంతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్

బోయిగూడలో..

బన్సీలాల్‌పేట్: నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతిని బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి కమిటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పెద్ద సామాజికవర్గమైన ముదిరాజ్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ముదిరాజ్ మహాసభ నాయకుడు కాసాని వీరేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం ముదిరాజ్‌లను బీసీ 'డి' నుంచి 'ఏ' మార్చాలని, జీఓ నంబర్ 15ను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎం.మురళి, రిటైర్డ్ ఐఏఎస్ జగన్మోహన్, ప్రభుత్వ న్యాయవాది పాండు, ముదిరాజ్ మహాసభ నాయకులు జి.దివాకర్, డి.సదానంద్, చెన్నయ్య, వెంకటేశం, సపానదేవ్, అంజయ్య, జగదీశ్వర్, శ్రీకాంత్, సురేందర్, మన్మోహన్, నీలం శ్రీనివాస్, ఎం.శారద, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి సహకరిస్తా

ఎమ్మెల్యే తలసానిని కలిసిన పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 26: నియోజకవర్గంలోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం పద్మారావు నగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిశారు. పార్కులో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల గురించి వారు ఆయనకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశిస్తానని అన్నారు. ఇటీవల వాకర్ల సంఖ్య పెరిగిందని, అందుకు తగిన విధంగా సదుపాయాలను కల్పించామని చెప్పారు. పార్కు అభివృద్ధికి తాను సహాయ సహకారాలను అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చక్రధర్‌యాదవ్, సభ్యులు కృష్ణారావు, జీకే రావు, బన్సీలాల్ పేట్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, నాయకులు ముక్క శ్రీనివాస్, గజ్జెల శ్రీను, సురేశ్, వినోద్, వెంకట్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే వర్గీకరణ చేయాలి

తుకారాంగేట్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పోరాట సమితి ప్రతినిధులు

అడ్డగుట్ట, ఆగస్టు 26: దళితుల్లో కులగణన తర్వాతే శాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపదే సనాధన్ అన్నారు. ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆదేశాల మేరకు సోమవారం తుకారాంగేట్‌లో ఉపకులాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ఉపాధ్యక్షుడు సనాధన్ మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాలను మాల, మాదిగలతో కలపొద్దని, దళితుల్లో అత్యంత వెనకబడ్డ ఉపకులాలను ఏ వర్గంలో చేర్చి 5 శాతం రిజర్వేషన్స్ కేటాయించాలని ఆయన తెలిపారు. వర్గీకరణ అమలుపై విధి విధానాలపై రిటైర్డ్ జడ్జితో కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. జనాభా ప్రాతిపదికన వర్గీకరణను అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సకట్ మిస్రాకర్, సంజు కమలే, విజయ్, గోపి, గణేశ్, ఉపదే మహేశ్, ఉపదే రతిలాల్, అక్షయ్, మోతిలాల్ పాల్గొన్నారు.

రామచంద్రుకు ఓయూ డాక్టరేట్

మట్టిపెల్లి రామచంద్రు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: ఓయూ మేథమేటిక్స్ విభాగంలో మట్టిపెల్లి రామచంద్రు డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ చెన్నకృష్ణారెడ్డి పర్యవేక్షణలో 'హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ అనాలసిస్ ఆఫ్ ఎంహెచ్‌డీ నాన్-న్యూటోనియన్ నానో ఫ్లూయిడ్స్ ఫ్లో విత్ గైరోటాక్టిక్ మైక్రో ఆర్గానిసమ్స్ ఇన్ ఎ పోరస్ మీడియం ఓవర్ డిఫరెంట్ జామెట్రీస్' అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం వర్ధమానుకోటకు చెందిన ఆయన మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. పలుమార్లు జైలు జీవితం సైతం గడిపారు. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత బోధనపై ఉన్న మక్కువతో మహాత్మాగాంధీ వర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. గణితశాస్త్రంపై ఉన్న ఆసక్తితో పీహెచ్‌డీలో చేరారు. తన పరిశోధనా క్రమంలో ఆయన రూపొందించిన పలు పరిశోధనాపత్రాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

వినోబానగర్‌లో డిప్యూటీ మేయర్ పర్యటన

స్థానికులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: తార్నాక డివిజన్ వినోబానగర్ కాలనీవాసులు తమ సమస్యలపై ఆదివారం నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డికి వినతిపత్రం అందించగా, వెంటనే స్పందించిన ఆమె సోమవారం ఆ కాలనీలో పర్యటించారు. శ్మశానవాటికను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న మౌలిక వసతులు మెరుగుపరచాలని స్థానికులు కోరగా, ప్రణాళికలు సిద్ధంగా చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌లాల్, మహేశ్, ప్రవీణ్, నరసింగరావు, జయ, వినోద్‌కుమార్, కిరణ్‌కుమార్, హనుమంతు, ఆంజనేయులు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి చైతన్యశ్రీకి మున్నూరుకాపు అవార్డు

విద్యార్థినికి మున్నూరుకాపు అవార్డుతో పాటు చెక్కును అందజేస్తున్న సంఘం నేతలు

సికింద్రాబాద్, ఆగస్టు 26: చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతిలో మెరిట్ సాధించిన స్టూడెంట్స్‌కు అవార్డ్స్‌తో పాటు నగదు బహుమతి అందజేశారు. సికింద్రాబాద్ సీతాఫల్‌మండికి చెందిన చైతన్యశ్రీ 10వ తరగతిలో మెరిట్ సాధించినందుకు వసతి గృహం ట్రస్ట్ బోర్డ్‌లో చైతన్యశ్రీకి గోల్డ్ మెడల్‌తో పాటు చెక్కును అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సంఘం నాయకులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రజకులను ఎస్సీల్లో చేర్చాలి

ప్రొఫెసర్ వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: రజకులను ఎస్సీల్లో చేర్చాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. రజక రిజర్వేషన్ సమితి చేస్తున్న డిమాండ్‌ను తాను స్వాగతిస్తున్నానని చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక చేసిన విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని 18 రాష్ట్రాల్లో ఎస్సీ జాబితాలో ఉన్న రజకులను తెలంగాణలోనూ ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. అగ్రవర్ణాల నుంచి ఎదుర్కొంటున్న కులవివక్షతను దృష్టిలో ఉంచుకుని వారిని ఎస్సీల్లో చేర్చి న్యాయం చేయాలని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో రజకుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. విద్య, ఉద్యోగ, సామాజిక, రాజకీయ తదితర అన్ని రంగాల్లో వారు వెనుకబడే ఉన్నారని చెప్పారు.

కుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానం

డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: ఉప్పల్ ఎన్‌జీఆర్ఐ అభయాంజనేయ స్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవానికి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతను నిర్వాహకులు ఆహ్వానించారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో శ్రీలత దంపతులకు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, ఆలయ ఈవో భాగ్యలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వమాతగా కీర్తి గడించిన మదర్ థెరిస్సా

రెజిమెంటల్‌బజార్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఎమ్మెల్యే శ్రీగణేశ్, క్రైస్తవ ప్రతినిధులు

మారేడ్‌పల్లి, ఆగస్టు 26: మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో భారతరత్న మదర్ థెరిస్సా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి మంగళవారం వివిధ రాజకీయ పార్టీల, క్రైస్తవ సంఘాల నాయకులు, చర్చి ఫాస్టర్లతో పాటు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిస్వార్థమైన సేవలతో విశ్వమాతగా కీర్తిగడించిన మదర్ థెరిస్సా విశ్వమానవాళికి స్ఫూర్తి దాయకమని అన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో బాబురావు, శ్రీనివాస్, ఆర్డీ నాగేశ్, బద్రినాథ్‌యాదవ్, శేఖర్ ముదిరాజ్, సదానంద్‌గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- డిప్యూటీ మేయర్ అసమర్థతతోనే పనుల్లో జాప్యం
- డివిజన్‌లో సమస్యల విలయం
- అయినా పట్టించుకోరా: బీఆర్ఎస్ నేత ఆలకుంట హరి

నిర్మాణంలో ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆలకుంట హరి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: తార్నాక డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆలకుంట హరి డిమాండ్ చేశారు. డివిజన్‌లో పెండింగ్ పనుల పురోగతిపై స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లాలాపేటలో హరి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాలాపేట ఆర్యసమాజ్ వెనుక వైపు బస్తీలో ఉన్న రోడ్డును నాలుగు నెలల క్రితం తొలగించి, నూతన రోడ్డు వేయకుండా కాలయాపన చేస్తుండడంతో స్థానికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోడ్డు సైతం గత కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి హయాంలో మంజూరైందని గుర్తుచేశారు. సొంత డివిజన్‌లో సమస్యలు పట్టించుకోని డిప్యూటీ మేయర్ అసమర్థతకు నిదర్శనమే రోడ్డు నిర్మాణంలో జాప్యమని మండిపడ్డారు. ఆమె మొద్దు నిద్ర కారణంగా డివిజన్‌లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని ఆరోపించారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుయ్యబట్టారు. రానున్న నవరాత్రులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌పై జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించని పక్షంలో జీహెచ్ఎంసీ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్‌ముదిరాజ్, బలరాం, మల్లికార్జున్, ప్రదీప్, నర్సింగ్‌రావు, ప్రకాశ్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ నెట్ తప్పనిసరి నిర్ణయాన్ని విరమించుకోవాలి

నెల్లి సత్య

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 26: ఓయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ నెట్ తప్పనిసరి నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ ప్రవేశాలను యూజీసీ నెట్ స్కోర్ ద్వారా నిర్వహించాలనే నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు స్వతంత్రంగా పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలను నిర్వహించి ప్రవేశాలు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఓయూలో కూడా ప్రవేశ పరీక్ష ద్వారానే పీహెచ్‌డీ ప్రవేశాలు నిర్వహించాలన్నారు. ఢిల్లీలోని జేఎన్‌యూ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీల్లో కూడా యూజీసీ నెట్ స్కోర్ ఆధారంగానే కేటగిరీ 2 పీహెచ్‌డీ ప్రవేశాలు నిర్వహించాలని అకున్నప్పటికీ, నెట్ పేపర్ లీక్ కారణంగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని వివరించారు. ఇటీవలే నీట్ పరీక్ష పేపర్ లీకై పరీక్షను రద్దు చేశారని గుర్తు చేశారు. నెట్ పరీక్షకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించడం వల్ల ఉత్తరాది విద్యార్థులు లాభపడతారని అన్నారు. మిగితా భాషల విద్యార్థులకు నష్టం చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ నిర్ణయంతో విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తి సైతం దెబ్బతినే అవకాశం ఉంటుందని వాపోయారు. విభిన్న సామాజికవర్గాల నేపథ్యాలను పరిగణనలోకి తీసుకొని మరింత సమగ్రమైన, పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను నిర్వహించి ప్రవేశ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు.

బాధితులకు పరామర్శ

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జైజవాన్‌కాలనీ దేవీనగర్‌లో రెండంతస్తుల ఇంటిలోని ఓ ఫ్లోర్ పాక్షికంగా దగ్ధం కావడంతో సదరు కుటుంబానికి చెందిన బాధితులను ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శించారు. రైల్వేలో పనిచేసే మాధురి, ఆమె కుమారుడు శైలేశ్ నివసిస్తున్నారు. ఘటన సమయంలో ఇంటిలో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని ఎమ్మెల్యేకు తెలిపారు. రూ.10లక్షల నుంచి 15లక్షల వరకు నష్టం వాటిల్లిందని వివరించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు జ్ఞాపికను బహుకరిస్తున్న యాదవ సంఘం

ఇస్కాన్ ఆలయంలో కొలువుదీరిన స్వామి వారు

మారేడ్‌పల్లి, ఆగస్టు 26: సికింద్రాబాద్ ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి సోమవారం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి. ఇబ్బందులు తలెత్తకుండా గోపాలపురం పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సహదేవ దాసన్, సురేశ్, రాధిక పతిదాస, హరికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీ ఫౌండేషన్‌లో..

బన్సీలాల్‌పేట్: పద్మారావునగర్‌లోని మీనాక్షీ వెంకటరామన్ ఫౌండేషన్ సిటీ సెంటర్‌లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వినికిడి సమస్యలు కలిగిన చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణ అందరిని ఆకట్టుకున్నాయి. ఎంవీఎఫ్ వ్యవస్థాపక ట్రస్టీ సేతురామన్, ట్రస్టీ వసంత సేతురామన్, డైరెక్టర్ రంగనాథన్, ప్రసాదరావు, మురళీ నటరాజన్, రాఘవేందర్‌రావు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో..

బొల్లారం: కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని కంసారి బజార్ యాదవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరై పూజలు చేశారు. బోర్డు మాజీ సభ్యుడు పాండు, మధుకర్, బద్రి, అరుణ్, మల్లేశ్, ముఖేశ్, వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

అమీర్‌పేట్: సనత్‌నగర్, అమీర్‌పేట్ ఆలయాల్లో చిన్నారులు చిన్న కృష్ణుని అలంకరణలతో సందడి చేశారు. చిన్నారుల వేషధారణలు ఆధ్యాత్మిక శోభను మరింత పెంచాయి.

పద్మారావునగర్ వేడుకల్లో చిన్నారులు